ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
జయశంకర్ భూపాలపల్లి
శుక్రవారం 14 నవంబరు 2025



## మునిసిపల్ కార్యాలయాన్ని సందర్శించిన ట్రైనీ ఐఏఎస్‌లు



8

మునిసిపల్ అధికారులతో ట్రైనీ ఐఏఎస్ అధికారుల బృందం

# కాంగ్రెస్ పాలనపై ప్రజలకు చెదరని నమ్మకం

- అందుకే జూబ్లీహిల్స్ ఎన్నికల్లో గెలవబోతున్నాం
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

కాటారం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనపై ప్రజలు చెదరని నమ్మకంతో ఉన్నారని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. అందుకే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌కే ప్రజలు పట్టం కడుతున్నారని అన్నారు. మండలంలోని ధన్వాడ, శంకరంపల్లి గ్రామాల్లో ఆయన గురువారం పర్యటించారు. పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. పలు శుభకార్యాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధన్వాడలో విలేకరులతో మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసం నుంచి కోలుకోవడానికి సమయం పడుతుందన్నారు. కాస్త ఆలస్యమైనా అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు (మిగతా 8వ పేజీలో)

# రైతులను వంచిస్తే కఠిన చర్యలు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లిటౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): దొడ్డి దారిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను వంచించాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హెచ్చరించారు. భూపాలపల్లిలోని ఐడీవోసీ కార్యాలయంలో జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయశాఖ, సహకార సంస్థ, మార్కెటింగ్, డీఆర్‌డీవో, రవాణా శాఖల అధికారులతో ఆయన గురువారం సమావేశమయ్యారు. ధాన్యం విక్రయించిన అనంతరం రైతుకు ఎలాంటి సంబంధం లేదని, కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలదే పూర్తి బాధ్యత అన్నారు. తరుగు పేరుతో రైతులను (మిగతా 8వ పేజీలో)





- తొలుత 2016లో వరంగల్ అర్బన్, రూరల్ జిల్లాల ఏర్పాటు
- 2021లో అర్బన్, రూరల్‌ను రద్దు చేసి వరంగల్, హనుమకొండ జిల్లాలుగా ఏర్పాటు
- ఇంకా అనేక శాఖల్లో అర్బన్, రూరల్ పేర్లే చెలామణి
- జేఈఈ పరీక్షలు రాసే విద్యార్థులను పరేషాన్ చేస్తున్న జిల్లాల పేర్లు
- ఆప్షన్‌లో ఇంకా కనిపిస్తున్న వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్
- పరీక్ష కేంద్రాల ఎంపికలో కనిపించని హనుమకొండ జిల్లా
- మద్యం టెండర్లు సైతం ఇటీవల అర్బన్, రూరల్ జిల్లాలుగానే నిర్వహణ
- ఇతర శాఖల నోటిఫికేషన్లలోనూ ఇదే తరహా సమస్యలు
- ఐదేళ్లు కావస్తున్నా అదే గందరగోళం

# విడగొట్టారు.. చోద్యం చూస్తున్నారు..

జిల్లాల పునర్విభజన జరిగి ఏళ్లు కావొస్తున్నా.. ఇంకా ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆ విభజిత జిల్లా గందరగోళానికి తెర పడటం లేదు. అప్పటి ప్రభుత్వం ఉమ్మడి వరంగల్ జిల్లాను ఆరు ముక్కలు చేసింది. చారిత్రక వరంగల్ నగరాన్ని కూడా రెండు ముక్కలు చేసింది. పరిపాలన సౌలభ్యం అంటూ హనుమకొండలో, వరంగల్‌లో రెండు కలెక్టరేట్లను ఏర్పాటు చేసింది. ఈ రెండు పట్టణాలు కలిసే ఉంటాయి. పైగా పదే పదే జిల్లాల పేర్లను మార్చి ప్రజలను, వివిధ శాఖలను గందరగోళంలో పడేసింది. గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల వరంగల్ ప్రజలు.. తమది ఏ జిల్లానో.. తాము ఇప్పుడు ఏ జిల్లాలో ఉన్నామో.. అనే అయోమయంలో ఉన్నారు. విద్యార్థులైతే మరింత గందరగోళానికి, ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వ పరంగా వరంగల్ అర్బన్, రూరల్ జిల్లాల పేర్లనే కొనసాగిస్తుండటంతో అనేక సమస్యలు ఎదురవుతున్నాయి.

## ఉమ్మడి వరంగల్ జిల్లాలో గందరగోళం రేపుతున్న విభజిత జిల్లాల పేర్లు

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

తెలంగాణలో అతిపెద్ద రెండో జిల్లాగా ఉన్న వరంగల్‌ను గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2016 అక్టోబరు 11న జిల్లాల పునర్విభజనలో ఐదు ముక్కలు చేసింది. వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, మహబూబాబాద్, జయశంకర్‌భూపాలపల్లి, జనగామ జిల్లాలుగా విభజించింది. ఆ తరువాత 2019 ఫిబ్రవరి 19న భూపాలపల్లి జిల్లాను రెండు ముక్కలు చేసి తొమ్మిది మండలాలతో ములుగు జిల్లాను ఏర్పాటు చేసింది. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లా ఆరు ముక్కలైంది. ఇక అక్కడితో ఆగకుండా అప్పటి గులాబీ నేతలకు సంబంధించిన మెడికల్ కాలేజీల ఏర్పాటు కోసం చారిత్రక వరంగల్ నగరాన్ని కూడా రెండుగావిభజించారనే ఆరోపణలు ఉన్నాయి. 2021 ఆగస్టు 12వ తేదీన వరంగల్ రూరల్, వరంగల్ అర్బన్ జిల్లాలను రద్దు చేసి వరంగల్, హనుమకొండ జిల్లాలను ఏర్పాటు చేశారు. దీంతో గులాబీ నేతలకు కావాల్సిన మెడికల్ వ్యాపారం పూర్తి చేసుకున్నారనే ప్రచారం జరుగుతోంది. నగరాన్ని రెండుగా విభజించిన ప్రభుత్వం.. రెండు కలెక్టరేట్లను కిలోమీటర్ల దూరంలోనే ఏర్పాటు చేసింది. అయితే హనుమకొండ కేంద్రంగానే రెండు జిల్లాల పాలన సాగుతోంది.

### ఏ జిల్లాలో ఉన్నామో....

వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్ జిల్లాలను రద్దు చేసి ప్రభుత్వం వరంగల్, హనుమకొండ (మిగతా 7వ పేజీలో)

## పకడ్బందీగా ఎన్‌సీడీ స్ర్కీనింగ్ చేపట్టాలి

కాటారం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్ (ఎన్‌సీడీ) స్ర్కీనింగ్‌ను పకడ్బందీగా చేపట్టి సకాలంలో ఆన్‌లైన్ చేయాలని ఎన్‌సీడీ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ సందీప్ అన్నారు. ఎన్‌సీడీపై కాటారం, తాడిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ఎంఎల్‌హెచ్‌పీ(మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్) వైద్యులు, వైద్య సిబ్బందికి శిక్షణ, స్ర్కీనింగ్, ఆన్‌లైన్ ప్రక్రియపై కాటారం పీహెచ్‌సీలో సమావేశం నిర్వహించారు. ఎన్‌సీడీలో 30ఏళ్ల పైబడ్డ వారందరికీ బీపీ, షుగర్, క్యాన్సర్(ఓరల్, బ్రెస్ట్) స్ర్కీనింగ్ పరీక్షలు చేసి సకాలంలో నివేదికలను ఆన్‌లైన్ చేయాలన్నారు. ఈకార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మౌనిక, డీడీఎం మధు, హెచ్‌ఈవో మురళీధర్, సీహెచ్‌వోలు లింగారెడ్డి, నిర్మల, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



అగ్ని ప్రమాదంలో కాలిపోతున్న ఇల్లు

## షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

ములుగు రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన సంఘటన మండలంలోని పొట్లాపూర్ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం... పొట్లాపూర్‌లో పారిశుధ్య కార్మికుడిగా పని చేస్తున్న ఈక రమేష్, అతడి కుటుంబ సభ్యులు కూలి పనుల నిమిత్తం బయటకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించి మంటలు చెలరేగాయి. ఎంతప్రయత్నించినా అదుపులోకి రాలేదు. ఇల్లు పూర్తిగా కాలిపోయి కట్టుబట్టలు మాత్రమే మిగిలాయి. ఇంట్లోని సామగ్రి, నిత్యావసర సరుకులతోపాటు అప్పుగా తీసుకున్న రూ.60వేలు కాలిబూడిదయ్యాయని బాధితుడు రమేష్ ఆవేదన వ్యక్తం చేశాడు.

## సీసీఐ కేంద్రం ప్రారంభం

కాటారం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాటారం జీపీ పరిధి మీనాక్షి జిన్నింగ్ మిల్లులో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని కాటారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పంతకాని తిరుమల సమ్మయ్య గురువారం ప్రారంభించారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాబు, సీసీఐ, మార్కెటింగ్ శాఖ అధికారులు, మిల్లర్లతో కలిసి సీసీఐ కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం చైర్‌పర్సన్ తిరుమల మాట్లాడుతూ సీజన్ చివర్లో కురిసిన వర్షాలతో పత్తి దిగుబడులు తక్కువగా వస్తున్నాయన్నారు. పత్తిలో తేమ శాతంపై సీసీఐ కఠినంగా వ్యవహరించకుండా రైతులపై ఉదారత ప్రదర్శించి కొనుగోలు చేసేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ కార్యదర్శి లా షరీఫ్, సీసీఐ సీపీవో ఇలంగోన్, ఏఎంసీ వైస్ చైర్మన్ బ్రహ్మరెడ్డి, డైరెక్టర్లు రమేష్, తిరుపతిరావు, రాజారాంనాయక్, మిల్లర్లు శివనాథుని కిషన్, ఉదిత్, రాణాప్రతాప్, ఏఎంసీ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### షరతులు లేకుండా కొనుగోలు చేయాలి

చిట్యాల(ఆంధ్రజ్యోతి): షరతులు, తరుగు లేకుండా పత్తిని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని మాజీ జడ్పీటీసీ గొర్రె సాగర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్ డిమాండ్ చేశారు. మండలంలోని ఓ ప్రైవేటు మిల్లులో సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ అకాల వర్షాలతో దిగుబడి తగ్గడంతో రైతులు ఆర్థికంగా నష్టపోయారని, ఈ ఏడాది పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చేతికందిన కొద్దిపాటి పంటను కొనుగోలు కేంద్రానికి తీసుకువస్తే తేమ సాకుతో క్వింటాల్‌కు 5 నుంచి 10 కిలోల వరకు తరుగు తీయడం అన్యాయమన్నారు. మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పిట్ట సురేష్, మండల ప్రధాన కార్యదర్శి మడికొండ రవీందర్‌రావు, టౌన్ అధ్యక్షుడు బుర్ర శ్రీధర్, యూత్ మండల అధ్యక్షుడు తౌటం నవీన్, నాయకులు పాల్గొన్నారు.

# పర్యాటక అభివృద్ధికి విశేష కృషి

- టూరిజం హబ్‌గా ములుగు జిల్లా
- ఇప్పటికే అనేక పనులకు శ్రీకారం
- మరిన్ని చేపట్టేందుకు ప్రత్యేక ప్రణాళిక
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క

ములుగు/వెంకటాపూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పర్యాటక అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని, ములుగు జిల్లాను టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతామని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. ములుగు జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు కలెక్టర్ టీఎస్.దివాకరతో కలిసి ఆమె గురువారం శంకుస్థాపనలు చేశారు. వెంకటాపూర్ మండలంలోని పాలంపేటలో ఉన్న రామప్ప సరస్సులో రూ.13కోట్లతో చేపట్టనున్న ద్వీపం(ఐలాండ్) అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అదే మండల కేంద్రంలోని మరో రూ.7 కోట్లతో నిర్మించనున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలతోపాటు ములుగులో సైన్స్, కంప్యూటర్ ల్యాబ్, బండారుపల్లి జంక్షన్ సుందరీకరణ, ముస్లిం కమ్యూనిటీ హాల్, గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఆఫీసర్ల భవన నిర్మాణం, 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం తదితర అభివృద్ధి పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. బండారుపల్లి జంక్షన్ సుందరీకరణలో భాగంగా ఏర్పాటు చేసిన 'ఐ లవ్ ములుగు' ఐకాన్‌ను ప్రారంభించారు.





ములుగులో ఏర్పాటు చేసిన 'ఐ లవ్ ములుగు' ఐకాన్‌ను ప్రారంభించి మాట్లాడుతున్న మంత్రి సీతక్క



రామప్ప ఐలాండ్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సీతక్క

ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ములుగు మండలం ఇంచర్ల గ్రామ సమీపంలో రూ.35కోట్లతో హంపీ థియేటర్‌ను ఏర్పాటుచేసి హస్తకళల తయారీకి అవకాశం కల్పించనున్నట్టు చెప్పారు. రూ.125కోట్లతో యంగ్ ఇండియా పాఠశాల భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని ఆమె పేర్కొన్నారు. ఇదే ప్రాంతంలో విలేజ్‌పార్క్‌తోపాటు నూనె తయారుచేసే కంపెనీ ఏర్పాటు కాబోతోందని, గోవిందరావుపేట మండలం లక్నవరం సరస్సులో మరికొన్ని ఐలాండ్‌ల నిర్మాణం ప్రారంభించనున్నామని వివరించారు. తాడ్వాయి మండలం మేడారంలోని సమ్మక్క-సారలమ్మల గద్దెల పునర్నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, మంగపేట మండలం మల్లూరులోని లక్ష్మీనరసింహస్వామి దేవాలయం అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టనున్నామని చెప్పారు వాజేడు మండలం బొగత జలపాతం వద్ద వంతెనలు ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. తాడ్వాయి మండలంలో బ్లాక్ బెర్రీ ఐలాండ్‌ను త్వరలో తిరిగి ప్రారంభిస్తామన్నారు. ములుగు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో సీసీరోడ్ల ఏర్పాటుతోపాటు లింకురోడ్ల పనులను పూర్తి చేయడం జరిగిందని, ఆయా గ్రామాల్లో డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచామని పేర్కొన్నారు. వచ్చే డిసెంబరు నాటికి తాము అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగా కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

## కష్టాలు కడతేరేదెన్నడు..?!

- కొండాయి వంతెనకు కలగని మోక్షం 8వ పేజీలో..



# గుంతల'కీ' బలైపోయారు..

- కారు తాళంచెవి కోసం మరో కారులో వెళ్లివస్తుండగా రోడ్డు ప్రమాదం
- పల్టీలు కొట్టి చెట్టును ఢీకొట్టడంతో ఇద్దరి దుర్మరణం
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- పరకాల కొత్తగట్టు క్రాస్‌రోడ్డు వద్ద ఘటన





మృతులు సంపత్, కిషన్‌రావు (ఫైల్)

ఆత్మకూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కారు తాళం చెవి కోసం మరో కారులో బయలుదేరిన నలుగురు వ్యక్తులు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. గుంతలను తప్పించబోయి చెట్టును కారు ఢీకొట్టగా ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్రంగా గాయాలయ్యాయి. ఈఘటన హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం కొత్తగట్టు శివారులో హనుమకొండ - పరకాల రహదారిపై గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది.

ఆత్మకూరు ఎస్సై సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం రేపాకపల్లికి చెందిన పార్శ సంపత్(55).. తాను పండించిన మిర్చిని కిందటేడు కోల్డ్ స్టోరేజీలో నిల్వ ఉంచాడు. దాన్ని అమ్మేందుకు బుధవారం తన కారులో వరంగల్‌కు వెళ్లాడు. అక్కడ పరకాల మండలం నాగారం గ్రామానికి చెందిన అడ్తి వ్యాపారి బొంపల్లి కిషన్‌రావు(36)తో కలిసి పంటను అమ్మాడు. అనంతరం ఇంటికి వెళ్లేందుకు సిద్ధం కాగా, కారు తాళం చెవి(కీ) దొరకలేదు. రెండో తాళం చెవి రేపాకపల్లిలోని ఇంట్లో ఉండడంతో వెళ్లేందుకు కిషన్‌రావు సాయం కోరాడు. దీంతో కిషన్‌రావు షాపు పక్కన ఉండే మరో షాపు నిర్వాహకుడైన పరకాల మండలం కామారెడ్డిపల్లికి చెందిన పోతరాజు వెంకటేష్ కారు అడిగాడు.

వెంకటేష్, తన భాగస్వామి అయిన ఆత్మకూరు మండలకేంద్రానికి చెందిన చింతపట్ల మురళీకృష్ణ, పార్శ సంపత్, కిషన్‌రావులు కలిసి బుధవారం రాత్రి 2 గంటల సమయంలో వరంగల్ వ్యవసాయ మార్కెట్ నుంచి కారు తాళం చెవి కోసం రేపాకపల్లికి వచ్చారు. అక్కడ కారు తాళం చెవి తీసుకున్నాక అందరూ కలిసి వరంగల్‌కు (మిగతా 8వ పేజీలో)

## ఇసుక లారీ ఢీకొని ఒకరి మృతి



బాలకృష్ణ (ఫైల్)

మంగపేట నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఇసుక లారీ ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురంలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కమలాపురం గ్రామానికి చెందిన దుర్గం బాలకృష్ణ (35) వ్యవసాయ కూలీగా పనిచేస్తుంటాడు. పొలం పనులు ముగించుకొని నడుచుకుంటూ వస్తూ కోరికొప్పుల వారి వీధి వద్ద రోడ్డు దాటుతుండగా మంగపేట నుంచి ఏటూరునాగారం వైపు ఇసుక లోడుతో వెళ్తున్న లారీ ఢీకొంది. దీంతో బాలకృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై టీవీఆర్ సూరి విచారణ చేపట్టారు. బాలకృష్ణను ఢీకొట్టిన డ్రైవర్ లారీని సంఘటన స్థలంలో ఆపకుండా తప్పించుకునేందుకు ఏటూరునాగారం వైపు వెళ్లగా మంగపేట ఎస్సై సూరి ద్వారా సమాచారం అందుకున్న ఏటూరునాగారం సీఐ శ్రీనివాస్ అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మృతుడు బాలకృష్ణకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## ప్రభుత్వం నిర్ణయించిన ధరకే ఫర్టిలైజర్స్‌ను విక్రయించాలి

దంతాలపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నిర్ణయించిన ధరకే ఎరువులు, విత్తనాలను విక్రయం జరపాలని వ్యవసాయాధికారుల బృందం సూచించింది. గురువారం మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్స్ దుకాణాలను అకస్మికంగా తనిఖీలు చేసి రిజిష్టర్లను పరిశీలించారు. రైతులు కొనుగోలు చేస్తోన్న ఎరువులు, విత్తనాల వివరాలను ప్రత్యేక రిజిష్టర్లలో నమోదు చేయాలన్నారు. యాసంగి పంటలో రైతులు ఇబ్బందులు పడకుండా విత్తనాలు, ఎరువులను సకాలంలో అందిస్తామన్నారు. ఈ సందర్భంగా బృందం సభ్యులు లైసెన్సులు, ఎరువుల నాణ్యత, నిల్వ, రికార్డులతో పాటు కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ఎరువుల నియంత్రణ ఉత్తర్వు ప్రకారం ఉన్నాయా లేదా అనే దానిపై పరిశీలించారు. రైతులు విత్తనాల విషయంలో వ్యవసాయాధికారులను సంప్రదించాలని యాసంగిలో ఇష్టానుసారంగా ఎరువులు వాడవద్దన్నారు. మండల పరిధిలోని మూడు క్లస్టర్‌లో ఏఈవోలు అందుబాటులో ఉండి సలహాలు, సూచనలు చేస్తారన్నారు. ఇప్పటికే మండలానికి సరిపడా యూరియాను అందించామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి వాహిని, ఏఈవోలు దీక్షిత్‌కుమార్, శిరీష, ఉదయ్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## కిసాన్ కపాస్ యాప్‌పై అవగాహన పెంచుకోవాలి

దంతాలపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఏఈవోలు కేంద్ర ప్రభుత్వం సహకారంతో ప్రారంభించిన కిసాన్ కపాస్ యాప్‌పై ప్రజల్లో విస్తృత అవగాహనను కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి పి.వాహని మాట్లాడుతూ క్లస్టర్‌లో పనిచేస్తోన్న ఏఈవోలు గ్రామాల్లోని రైతులకు కపాస్ యాప్‌పై అవగాహన కల్పించాలన్నారు. రైతులు పత్తి విక్రయానికి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ప్రభుత్వం కిసాన్ కపాస్ యాప్‌ను అమలులోకి తెచ్చిందన్నారు. రైతులు తమ మొబైల్ ద్వారా యాప్‌లో రిజిస్ట్రేషన్ అనంతరం స్లాట్ బుక్ చేసుకోని మిల్లుల వద్దకు తీసుకురావాలన్నారు. తద్వారా సరైన రైతులకు ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర లభిస్తుందన్నారు. రైతులు మధ్య దళారులకు విక్రయం జరపకుండా నేరుగా యాప్ ద్వారా మాత్రమే పత్తి విక్రయం చేసుకోవాలన్నారు.

## 15న ఇంగ్లీష్ ఒలింపియాడ్ పోటీ పరీక్షలు

మరిపెడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 15వ తేదిన జరిగే పాఠశాలల స్థాయి ఇంగ్లీష్ ఒలింపియాడ్ పరీక్షలను విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఎల్టా మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బయగాని రాంమోహన్ గురువారం ఓ ప్రకటనలో కోరారు. ఎస్సీఈఆర్టీ, భారతి ఫౌండేషన్ సహకారంతో ఈ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పరీక్షల ద్వారా సృజనాత్మక ప్రసంగాలు, ఆంగ్లభాష నైపుణత పెంపొందుతుంద న్నారు. 6, 7, 8 తరగతులను జూనియర్ కేటగిరిగా, 9, 10 తరగతుల విద్యార్థులను సీనియర్ కేటగిరిగా గుర్తిస్తారన్నారు. ఈ పోటీ పరీక్షలలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, మోడల్ స్కూల్, కేజీబీవీ పాఠశాలల విద్యార్థులు పాల్గొంటారన్నారు. ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్, హెచ్ఎంలు, స్పెషల్ ఆఫీసర్లు ఈ పరీక్షల విజయవంతానికి కృషిచేయాలని ఆయన కోరారు.

## ఉచిత కంటివైద్య శిబిరం

తొర్రూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు ఆధ్వర్యంలో లయన్స్ చారిటబుల్ హాస్పిటల్ సుబే దారి హన్మకొండ వారి సాకారంతో గురువారం తొర్రూరులోని లయన్స్ క్లబ్ ఆవరణలో పేదలకు, వృద్ధులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ రాంనర్సయ్య మాట్లాడు తూ పేద ప్రజల కోసం క్లబ్ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్ర మాలు చేపడుతున్నామన్నారు. చనిపోయిన వారి నేత్రాలు దానం చేసేందుకు వారి కుటుంబ సభ్యులు ముందుకు రావా లని పిలుపునిచ్చారు. నేత్రదానం మరొకరికి ప్రాణదానం అవుతుందన్నారు. ఈ శిబిరంలో 150 మందికి పరీక్షలు నిర్వ హించి ఆపరేషన్ అవసరం ఉన్న 52 మందిని హనుమకొండ లోని కంటి ఆస్పత్రికి పంపించామన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు డాక్టర్ రాజేందర్ రెడ్డి, లక్ష్మీనర్సింహ రావు, విశ్వేశ్వర రావు, రవీందర్ రెడ్డి, వజినపల్లి శ్రీను, గోపాల్, పాండు, వెంకట్ రెడ్డి, రేగూరి వెంకన్న, ప్రభాకర్, సరేష్, తదితరులు ఉన్నారు.

# జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికలు

రఘునాథపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : స్టేషన్‌ఘన్‌పూర్ పట్టణంలోని శ్రీవాణి గురుకుల విద్యాలయంలో 16న జిల్లా స్థాయి కబడ్డీ జూనియర్ బాలబాలికల ఎంపికలు జరుగుతాయని జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఛైర్మన్ పోగుల సారంగపాణి, అధ్యక్షుడు ఎర్రోళ్ల కుమార్ గౌడ్ తెలిపారు. మండల కేంద్రంలో గురువారం వారు మాట్లాడుతూ కబడ్డీ క్రీడ ఎంపికలకు హాజరయ్యే బాలబాలికలు ఒరిజినల్ ఎస్ఎస్‌సి మెమోతో పాటు ఆధార్ కార్డుతో రావాలని, బాలురు 18 జనవరి 2006 తర్వాత, బాలికలు 29 డిసెంబరు 2005 తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు. ఎంపికైన బాలికలు 2 డిసెంబరు 2025 నుంచి 4 డిసెంబరు 2025 వరకు నల్గొండ జిల్లాలో జరిగే కబడ్డీ జూనియర్ రాష్ట్రస్థాయి టోర్నమెంటులో, బాలురు 5 డిసెంబరు 2025 నుంచి 7 డిసెంబరు 2025 వరకు మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.మిగతా వివరాలకు 8328211430, 9010255898 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో తోటకూరి గట్టయ్య, ఎదునూరి ఉప్పలయ్య, పిడి సాంబన్న పాల్గొన్నారు.

# దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

● ప్రైవేటు పాఠశాలల బంద్



పట్టణంలో ర్యాలీ చేస్తున్న ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు

తొర్రూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలలపై విద్యార్థి సంఘాల పేరిట దాడులకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ట్రస్మా జిల్లా సలహాదారు ముత్తినేని జయప్రకాశ్ అన్నారు. గురువారం ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు పట్టణంలో పాఠశాలలు బంద్ చేసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్‌లోని ఓ ప్రైవేటు పాఠశాల ప్రిన్సిపాల్‌పై పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అకారణంగా దాడికి పాల్పడ్డాడని, అతనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. విద్యార్థి సంఘాలు, పాఠశాలల యాజమాన్యాలు కలిసి పనిచేస్తే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని, విద్యార్థి సంఘాల పేరిట కొందరు యువకులు పాఠశాలలపై దాడి చేస్తూ విద్యార్థులను భయపెడుతున్నారన్నారు. సంఘాల పేరుతో వచ్చేవారు తాము విద్యార్థులమే అని విషయాన్ని గుర్తుంచుకోవాలని, యాజమాన్యాలపై దాడులు చేస్తే ట్రస్మా తరపున చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అబ్యాస్ స్కూల్ కరస్పాండెంట్ కె.నరేశ్‌రెడ్డి, వికాస్ స్కూల్ తాళ్లపల్లి రమేశ్, వేముల రమేశ్, రవీంద్రనాథ్, రవీందర్, ఎ. నాగిరెడ్డి, కృష్ణ, వెంకన్న, రమేశ్ తదితరులు ఉన్నారు.

## మట్టిపాత్రలతోనే ఆరోగ్యం

● టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డి

తొర్రూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రాచీన కాలం నుంచి మట్టి పాత్రలలో వండిన వంటలు, వాటిని భుజించడం వల్లే ఆరోగ్యంగా ఉండేవారని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. గురు వారం పట్టణంలో ఏర్పాటు చేసిన చద్దన్నంతో ఆరోగ్య సాధన స్టాల్స్‌ను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. చద్దన్నం ఇప్పుడు అమెరికా రెస్టారెంట్‌లలో దొరుకుతుందని, కర్డ్ రైస్ అంటూ అమ్మే ఈ చద్దన్నంలో ఎన్నో పోషకాలు ఉంటాయన్నారు. వేసవిలో చద్దన్నం తింటే కడుపులో చల్లగా ఉంటుందని, ఎంతో ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. నేటి ఆధునిక యుగంలో ఫాస్ట్‌ఫుడ్‌లకు అలవాటు పడిన యువత అప్పటి ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలని, దాంతో అందరు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పెదగాని సోమయ్య, సురేందర్ రెడ్డి, విజయ్‌పాల్ రెడ్డి, రాంచంద్రయ్య, సురేష్, మహేష్, శ్రీనివాస్, రాజు తదితరులు ఉన్నారు.

## బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ

చిన్నగూడూరు (మరిపెడ), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బాధిత కుటుంబ సభ్యులను మాజీ మంత్రి డీఎస్ రెడ్యానాయక్ గురువారం పరామర్శించారు. చిన్నగూడూరు మండలం జయ్యారానికి చెందిన గుడె శాంతమ్మ మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న రెడ్యానాయక్ జయ్యారానికి వచ్చి మృతి రాలి భౌతికాయానికి పూల మాలలేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. వల్లూరి చెన్నా రెడ్డి, గుడె భిక్షం, వీరన్న, శ్రీనివాస్, వీరస్వామి తదితరులు ఉన్నారు.

## వాహనాల తనిఖీలు

దంతాలపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సూర్యాపేట- దంతాలపల్లి క్రాసు రోడ్డు వద్ద బుధవారం రాత్రి ఎస్సై పిల్లల రాజు ఆధ్వర్యంలో విస్తృత వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యాపేట, వరంగల్ వైపు నుంచి వచ్చే వివిధ రకాల వాహనాలను అకస్మికంగా తనిఖీలు చేసి పత్రా లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై రాజు మాట్లాడుతూ వాహన దారులు తప్పక సంబంధిత వాహనాలకు పత్రాలను అందుబాటులో ఉంచుకొని వాహనాలను నడపాలన్నారు. లేనిచో చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామ ని ఆయన హెచ్చరించారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేసి లైసెన్స్ రద్దుకు సిఫారస్సు చేస్తామన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఎక్సైజ్ వాహనాల వేలం
### ఆదాయం రూ.6 లక్షలు

తొర్రూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను గురువారం తొర్రూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వేలంపాట నిర్వహించారు. వరంగల్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ అంజన్‌రావు హాజరై వేలంపాటలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా గుడుంబా తయారు చేసినా విక్రయించినా చర్యలు తప్పవన్నారు. ఆర్టీవో నిబంధనల మేరకు మొత్తం 68 ద్విచక్ర, కార్లు ఇతర వాహనాలు ఉండగా 44వాహనాలను విక్రయించగా జీఎస్టీతో కలుపుకుని రూ.6,07,700 ఆదాయం సమకూరిందని తెలిపారు. ఈవేలంపాటలో ఎక్సైజ్ సీఐ అశోక్, ఎస్సైలు, సిబ్బంది ఉన్నారు.

## తెగిపోయిన శ్మశాన వాటిక కల్వర్టు


మొంథా తుఫానుకు తెగిపోయిన తుమ్మల చెర్వుతండా జీపీ శ్మశాన వాటిక కల్వర్టు

చిన్నగూడూరు (మరిపెడ), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : తుమ్మల చెర్వు తండా జీపీ శశ్మాన వాటికకు వెల్లే రహదారిపై ఉన్న కల్వర్టు మొంథా తుఫాన్ దాటికి తెగిపోయింది. దీంతో ఆ తండా ప్రజలు అనేక ఇబ్బందులు పడుతు న్నారు. గత సంవత్సరం ఆగస్టు 31న వచ్చిన వరదలకు ఈ కల్వర్టు పూర్తిగా కోట్టుకపోగా స్థానిక ఆ తండావాసులు తలోచేయేసి పునసర్నిర్మించుకున్నారు. మొన్నటి తుఫాన్‌కు మళ్లీ తెగిపోయింది. అధికారులు ఆ కల్వర్టును నిర్మించాల ని అక్కడి గిరిజనులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

## చికిత్స పొందుతూ గీత కార్మికుడి మృతి


ఎల్లయ్య (ఫైల్)

బచ్చన్నపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : తాటి చెట్టు పైనుంచి పడి తీవ్ర గాయాలైన గీత కార్మికుడు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు పోతుగంటి ఎల్లయ్య ఈనెల 11న తాటిచెట్టు ఎక్కగా ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య శంకరమ్మ, ముగ్గురు కుమారులు, కూతురున్నారు. ఎల్లయ్య కుటుంబా న్ని ప్రభుత్వం ఆదుకోవాలని, ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షు బూడిద గోపి కోరారు.

## అక్రమంగా వరిచేను కోసిన వారిపై చర్యలు తీసుకోవాలి

బచ్చన్నపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : తమ పంట చేనులో అక్రమంగా కోసి, ధాన్యాన్ని తీసుకెళ్లారని, వారిపై చర్యలు తీసుకోవాలని జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం గంగాపూర్‌కు చెందిన పాకాల చిరంజీవి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈయనకు మద్దతుగా ఎమ్మార్పీఎస్‌తో పాటు పలు పార్టీలకు చెందిన నాయకులు వచ్చి చిరంజీవికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వరి చేను కోసిన హర్వెస్టర్ యజమానితోపాటు, దీని వెనుక ఉన్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. చిరంజీవి ఫిర్యాదు మేరకు విచారణ జరుపుతున్నామని ఎస్ఐ హమీద్ తెలిపారు.

## మల్కాపూర్ దుర్గామాత ఆలయంలో చోరీ

చిలుపూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా చిలుపూర్ మండ లం మల్కాపూర్ దుర్గామాత ఆలయంలో చోరీ జరిగిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై నవీన్‌కుమార్ కథనం ప్రకారం బుధవారం అర్ధరాత్రి గ్రామ సమీపంలో ఉన్న ఆలయానికి గుర్తుతెలియని దొంగలు చొరబడి అమ్మవారి మెడలోని రూ.50వేల విలువైన బంగారు ముక్కుపుడక, వెండి పుస్తెలతాడును ఎత్తుకెళ్లారు. సీసీ కెమరాలను ధ్వంసం చేసి నగలను ఎత్తుకెళ్లారు. ఆలయ అభివృద్ధి కమిటీ బాధ్యులు, మార్కెట్ డైరెక్టర్ మాదిరెడ్డి యశ్వంత్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## పెరిక సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా రాధాకృష్ణ



మంగపేట నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పెరిక సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా మలుగు జిల్లా మంగపేట మండలంలోని తిమ్మంపేట గ్రామానికి చెందిన ఆక రాధాకృష్ణను ఎన్నుకున్నారు. హైదరాబాద్‌లోని పెరిక భవన్‌లో జరిగిన సమావేశంలో ఈ మేరకు తనను ఎన్నుకున్నారని ఆయన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెరిక కులస్థుల హక్కుల సాధనకు తన వంతు కృషి చేస్తానని అన్నారు.



# నేటికీ మారని దళితుల స్థితిగతులు

మాల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు


కమలాపురం దళితకాలనీలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

మంగపేట నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య వచ్చి 78 ఏళ్ల దాటినా దేశంలోని దళితుల స్థితిగతులు నేటికీ మారలేదని తెలంగాణ మాల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పెరుమాండ్ల వెంకటేశ్వర్లు అన్నారు. ములుగు జిల్లా మంగపేట మండలంలోని కమలాపురంలోని దళిత వాడల్లో ఆయన గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వాలు ఎన్ని మారినా దళిత వాడలు బాగుపడిన దాఖలాలు లేవన్నారు. దళితులు ఇంకా దుర్భర జీవితాన్నే గడుపుతున్నారని అన్నారు. నేటికి రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీటి సౌకర్యాలు మెరుగుపడలేదన్నారు. దళితులపై దాడులు, దౌర్జన్యాలు, అత్యాచారాలు నేటికీ జరుగుతూనే ఉన్నాయని విమర్శించారు. ఈ దాడులు ఆగాలంటే దళితుల్లో చైతన్యం రావాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మాల పోరాట సమితి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మేడిపల్లి రాణి, రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు, టీచర్లు

కాటారం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ప్రైవేట్ పాఠశాల యాజమాన్యంపై విద్యార్థిసంఘ నాయకులు దాడి చేయడాన్ని నిరసిస్తూ మండలకేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో గురువారం తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) ఆధ్వర్యంలో భూపాలపల్లి జిల్లా కాటారం డివిజన్ పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు గురువారం రాస్తారోకో చేశారు. పాఠశాలలు బంద్ పాటించి నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసనకు దిగారు.

నిరసనలో ట్రస్మా జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వీరమనేని సంపత్‌రావు, జనగామ కార్తీక్‌రావు, ఉపాధ్యక్షురాలు మంజుల, కోశాధికారి నవీన్, పాఠశాలల కరస్పాండెంట్లు, హెచ్ఎంలు వలుస వెంకటేశ్వర్లు, కొట్టె శ్రీశైలం, బుర్ర వెంకటేష్‌గౌడ్, పృథ్వీధర్‌రావు, రమణారెడ్డి, చీర్ల శ్రీనివాస్‌రెడ్డి, ఎం.ఎం.శశికుమార్, రాంచందర్‌రెడ్డి, రాజబాబు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగం సమస్యలు పరిష్కరించాలి

వీసీకే పార్టీ యూత్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్


చిట్యాలలో మాట్లాడుతున్న అనిల్‌కుమార్

చిట్యాల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా నెలకొన్న విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని విముక్త చిరుతల పార్టీ యూత్ రాష్ట్ర అధ్యక్షుడు అంబాల అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. భూపాలపల్లి జిల్లా చిట్యాల జూనియర్ కాలేజీని ఆయన గురువారం సందర్శించి, విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉండటం వల్ల విద్యార్థుల చదువులకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. ప్రభుత్వం స్పందించి ఇప్పటికైనా స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కళాశాల విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం పథకంతో పాటు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలన్నారు.

## పదో తరగతి పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫీజును ఈ నెల 20 వరకు పొడిగిస్తూ ప్రభుత్వ పరీక్షల సంచాలకులు ఉత్తర్వులు జారీ చేసినట్లు వరంగల్, హనుమకొండ డీఈవోలు రంగయ్యనాయుడు, వెంకట్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారంతో గడువు ముగియనుండగా గడువును 20 వరకు పొడిగించినట్లు వారు పేర్కొన్నారు.

## స్టాఫ్ నర్సు పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ మెడికల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్టాఫ్ నర్స్ నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కాకతీయ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్య ఒక ప్రకటనలో తెలిపారు. 19 పోస్టులకు ఔట్‌సోర్సింగ్ విధానంలో, తాత్కాలిక ప్రాతిపదికన 2026 మార్చి 31వ తేదీ వరకు మాత్రమే ఉంటాయని పేర్కొన్నారు. ఎంపికైన పీఎంఎస్ఎస్‌వై సూప ర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో సేవలు అందించాల్సి ఉంటుందని తెలిపారు. దరఖాస్తులను కేఎంసీ వెబ్‌సైట్ నుంచి పొందాల్సి ఉంటుదన్నారు.

## అక్రమ డిప్యూటేషన్లు జరగలేదు

● హనుమకొండ జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారి ప్రేమకళారెడ్డి

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల్లో అక్రమ డిప్యూటేషన్లు జరగలేదని, ఈ ప్రచారంలో నిజం లేదని హనుమకొండ జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారి ప్రేమకళారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జనగామ జిల్లా పరిధిలో నిర్వహిస్తున్న గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ప్రతీ సబ్జెక్టుకు టీచర్ ఉన్నారన్నారు. అదనంగా ఉన్న ఉపాధ్యాయులను ఐటీడీఏ పీవో ఆదేశానుసారం హనుమకొండ జిల్లాలోని రెండు గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో సర్దుబాటు చేశామన్నారు. ప్రస్తుతం జనగామ జిల్లాలో టీచర్ల లోటు లేదన్నారు. అలాగే ఐదుగురు సీఆర్‌టీలను వారి అభ్యర్థన మేరకు పరస్పర డిప్యూటేషన్లు చేశామని, దీని వలన ఏ పాఠశాలలో కూడా ఇబ్బందులు లేవని ప్రేమకళారెడ్డి ఆ ప్రకటనలో తెలిపారు.

## గురుకుల పాఠశాల నుంచి గోడదూకి పారిపోయిన విద్యార్థి

తొర్రూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల నుంచి విద్యార్థి గోడదూకి పారిపోయిన ఘటన గురువారం తెల్లవారు జామున మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికులు, ప్రిన్సిపాల్ తెలిపిన ప్రకారం.. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం మల్లారెడ్డిపల్లెకు చెందిన ఓ విద్యార్థి 5వ తరగతిలో గత నెల 29న తొర్రూరులోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో చేరాడు. గురువారం తెల్లవారు జామున 3 గంటలకు వాష్‌రూమ్‌కు వెళ్లేందుకు లేచి పాఠశాల వెనక గోడ దూకి బయటకు వెళ్లిపోయాడు. మెయిన్ రోడ్డుకు వెళ్లి జాతీయ రహదారిపై వెళ్తున్న లారీ ఎక్కి వెళ్లడంతో ఆ లారీ హనుమకొండ మీదుగా హుజూరాబాద్ సమీపంలో ప్రమాదానికి గురైంది. గుర్తించిన స్థానికులు ఘటన స్థలానికి చేరుకుని 108కు, పోలీసులకు సమాచారం అందించగా అక్కడికి చేరుకున్న పోలీసులు బాలుడు రాజేశ్‌ను గుర్తించి వివరాలు అడిగి తల్లిదండ్రులకు అప్పగించారు. ప్రిన్సిపాల్ శంకర్ మాట్లాడుతూ బాలుడు పాఠశాలలో చేరినప్పటి నుంచి ఇక్కడ ఉండనని మారాం చేస్తున్నాడని, తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చామన్నారు. గురుకుల పాఠశాలలో సీసీ కెమెరాలు, వార్డెన్‌లు, నైట్ వాచ్‌మెన్‌లు ఉన్నప్పటికీ విద్యార్థులు పారిపోతుండటంతో పర్యవేక్షణ కరువైందని, సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## పొలాల్లో గుర్తు తెలియని మృతదేహం

పర్వతగిరి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పంట పొలాల్లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన మండలంలోని కొంకపాక గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కొంకపాక గ్రామానికి చెందిన గడ్డల రాములు అనే రైతు పొలంలో 65 ఏళ్ల వయసు గల వృద్ధుడి మృతదేహం లభ్యమైనట్లు తెలిపారు. వృద్ధుడి ఒంటిపై లేత గులాబీ రంగు లుంగీ, నీలిరంగు చొక్కా ఉన్నట్లు తెలిపారు. ఎస్ఐ ప్రవీణ్ సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేశారు. ఆ మృతదేహన్ని వరంగల్ ఎంజీఎం మార్చురీకి తరలించారు. చుట్టూ పక్కల ప్రాంతాల్లో ఎలాంటి ఆధారాలు లభించలేదని ఎవరైనా వివరాలు తెలిసి ఉంటే 87126875242, 8712685028 ను సంప్రదించాలన్నారు.

## కాళేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు


గోదావరి హారతి పడుతున్న అర్చకులు

మహదేవపూర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో గురువారం కార్తీక మాస ప్రత్యేక పూజలు జరిగాయి. ప్రధాన పండితులు, అర్చకులు ఉదయం 4 గంటల నుంచే స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ముందుగా గోదావరిలో స్నానం ఆచరించారు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వరస్వామి వారికి అభిషేకాలు, పూజలు చేశారు. శుభానందదేవి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం భక్తులు తీర్థ ప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు.

### ఘనంగా గోదావరి హారతి

కార్తీక మాస గోదావరి హారతి గురువారం సాయంత్రం అర్చకులు గోదావరి హారతి ఘనంగా నిర్వహించారు. ముందుగా మంగళవాయిద్యాలతో గోదావరి వద్దకు చేరి చీరె. సారె సమర్పించారు. అనంతరం గోదావరి హారతి నిర్వహించారు.



# అగ్రంపహాడ్ జాతరపై చిన్నచూపేలా ?

» నేటి వరకు మొదలు కాని అభివృద్ధి పనులు
» జాతర గడువు సమీపిస్తున్నా పట్టించుకోని పాలకులు
» అధికారుల తీరుపై మండి పడుతున్న భక్తులు

ఆత్మకూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సమ్మక్క జన్మస్థానమైన అగ్రంపహాడ్ సమ్మక్క-సారలమ్మ జాతర గడువు సమీపిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై భక్తులు మండిపడుతున్నారు. రెండో మేడారంగా పేరుగాంచిన అగ్రంపహాడ్ జాతరకు లక్షలాది భక్తులు తరలివచ్చి వనదేవతలకు మొక్కలు చెల్లించుకుంటారు. రెండు నెలల ముందు నుంచే వచ్చి భక్తులు అగ్రంపహాడ్‌లో చెల్లించుకున్న తర్వాతనే మేడారానికి వెళ్లడం ఆనవాయితీ. జాతరకు గత ప్రభుత్వాలు ఆరు నెలల ముందే నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేసేవారు. అలాగే అన్ని శాఖల అధికారులతో కలెక్టర్, సీపీ పలుమార్లు జాతర పరిసరాలను పరిశీలించి సకల ఏర్పాట్లు చేసేవారు. అయినా భక్తులకు పూర్తి స్థాయిలో సౌకర్యాలు అందక ప్రతీ జాతరకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం జాతర గడువు కనీసం రెండు నెలలు కూడా లేదు. ఇప్పటి వరకు కలెక్టర్, సీపీ, ఉన్నతాధికారులు పరిశీలించిన దాఖలాలు లేవని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. జాతరకు వచ్చే భక్తులు స్నానం చేసే ఎస్సారెస్పీ కాలువ తుమ్మ చెట్లతో నిండిపోయింది. జాతర చుట్టూ ఉన్న రైతులు పంటలు వేయకుండా అధికారులు నోటీసులు ఇవ్వడంతో పాటు నష్టపరిహారం అందిస్తామని హామీ ఇస్తే పంటలు వేయకుండా ఉంటారని భక్తులు పేర్కొంటున్నారు. గతంలో మరుగుదొడ్ల నిర్మాణం, వనం తెచ్చే స్థలాలు కబ్జాకు గురైనట్లు భక్తులు తెలుపుతున్నారు. అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జాతర చుట్టు బెల్ట్‌షాపులు ఉండడంతో మద్యం సేవించిన వారు జాతర ప్రాంగణంలో బాటిళ్లను పగులగొడుతున్నారు. దీంతో జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తప్పేలా లేవు. ఆత్మకూరు నుంచి చౌళ్లపల్లి మీదుగా జాతరకు వచ్చే బీటీ రోడ్డు అధ్వానంగా తయారైందని భక్తులు ఆరోపిస్తున్నారు. అలాగే ఆరు సంవత్సరాల క్రితం కంకర పోసి నేటి వరకు బీటీ వేయకపోవడంతో జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తప్పవని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అంటున్నారు. జాతర సమీపంలోని చెరువును కొందరు కబ్జా చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని భక్తులు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. గత జాతరకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు లేకపోవడంతో భక్తులు నానా ఇబ్బందులు పడ్డారు. గతంలో పోలీసులు కూడా జాతరకు వచ్చే భక్తులను అదుపుచేసే క్రమంలో ఓ పోలీసు అధికారి భక్తురాలిపై చేయి చేసుకున్న ఘటనలు ఉన్నాయి. ఈ సారైనా అన్ని శాఖాధికారులు సమన్వయంతో పని చేసి సౌకర్యాలు కల్పించాలని భక్తులు కోరుతున్నారు.



జాతర సమీపంలోని చౌళ్లపల్లి రోడ్డు దుస్థితి



అమ్మవార్ల గద్దెల ప్రాంగణంలో పేరుకుపోయిన చెత్త

### గతంలో 6 నెలల ముందే పనులు చేశాం..
**- జాతర మాజీ చైర్మన్ గుండెబోయిన రాజన్నగౌడ్**



అగ్రంపహాడ్ సమ్మక్క- సారలమ్మ జాతరకు 6 నెలల ముందు నుంచే ప్రభుత్వం నుంచి నిధులు తీసుకువచ్చి అభివృద్ధి పనులు చేశాం. అన్ని శాఖల అధికారులతో ప్రతీ పక్షం రోజులకు ఒకసారి సమీక్షించి అధికారులను అప్రమత్తం చేసి అభివృద్ధి పనులను వేగవంతం చేశారు. ప్రస్తుతం జాతర గడువు సమీపించినా అభివృద్ధి పనులు ప్రారంభించలేదు.. నిధులు లేవు.. కనీసం అధికారులు కూడా పట్టించుకోవడం లేదు.

# జీవాంజి దీప్తికి అప్సర అవార్డు



మురళీమోహన్ నుంచి అవార్డు అందుకుంటున్న జీవాంజి

పర్వతగిరి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లెడ గ్రామానికి చెందిన పారా అథ్లెట్ జీవాంజి దీప్తికి ఓ న్యూస్ చానల్ అప్సర అవార్డును ప్రదానం చేసింది. ఈ మేరకు హైదరాబాద్‌లో నిర్వహించిన అప్సర అవార్డులో 2025 కార్యక్రమంలో ప్రైడ్ ఆఫ్ తెలుగు స్పోర్ట్స్ అవార్డును ప్రదానం చేశారు. సినీ నటుడు, మాజీ ఎంపీ మురళీ మోహన్ చేతుల మీదుగా దీప్తి అవార్డును అందుకుంది. మారుమూల ప్రాంతంలో జన్మించి గిరిజన కుటుంబం నుంచి వచ్చిన దీప్తి సేవలను కొనియాడారు.

# మెడికల్ షాపులు, బ్లడ్ బ్యాంకుల్లో సోదా

**రికార్డులను పరిశీలించిన డ్రగ్ కంట్రోల్ శాఖ**

వరంగల్ మెడికల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ, వరంగల్ నగరంలోని పలు ఆస్పత్రులకు అనుబంధంగా ఉన్న ఔషధ దుకాణాలు, రక్తనిధి కేంద్రాలపై గురువారం హనుమకొండ ఔషధ తనిఖీ అధికారి జన్ను కిరణ్ కుమార్, భూపాలపల్లి అధికారి పావని, జనగామ అధికారి బాలకృష్ణ తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు మెడికల్ షాపుల్లో రికార్డులు పరిశీలించి, నాణ్యత పరీక్షల నిమిత్తం కొన్ని రకాల మందులను ప్రభుత్వ ప్రయోగశాలకు పంపించారు. ఎవరైనా అధిక ధరలకు మందులు విక్రయించినా, బిల్లు ఇవ్వకపోయినా ఇతరత్రా సేవా లోపాలుంటే ఔషధ తనిఖీ అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. గర్భవిచ్ఛిత్తి మందులు అర్హత గల వైద్యుడి పర్యవేక్షణలో మాత్రమే వాడాల్సి ఉందని, అర్హత లేని వైద్యులకు ఔషధాలు విక్రయించరాదన్నారు. చట్టం నిబంధనలు ఉల్లంఘించినట్లయితే క్రిమినల్ చర్యలకు తీసుకుంటామని వారు హెచ్చరించారు.




ఓ మెడికల్ షాపులో తనిఖీ చేస్తున్న డ్రగ్ కంట్రోల్ శాఖ అధికారులు

# చైతన్య దీప్తులు.. కాళోజీ సోదరులు

• యాది సభలో ఎం. రాజేందర్ • ఘనంగా కాళోజీ సోదరుల స్మారక పురస్కారాలు



సమావేశంలో మాట్లాడుతున్న అంపశయ్య నవీన్

హనుమకొండ కల్చరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పలుకు బడుల భాషకు పట్టం కట్టాలని నినదించి, ప్రజల్లో చైతన్య దీప్తిని వెలిగించి జీవితాంతం వారి గొంతుకగా బతికిన కవి సోదరులు కాళోజీ సోదరులని ప్రజాకవి కాళోజీ స్మారక పురస్కార గ్రహీత డాక్టర్ మంగారి రాజేందర్ కొనియాడారు. హనుమకొండలోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల సెమినార్ హాలులో కాళోజీ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు ఎస్.జీవన్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ అంపశయ్య నవీన్ మాట్లాడుతూ.. వరంగల్ నేల ఎంతో గొప్పదని, కవుల కాణాచి అని అన్నారు. ఈ క్రమంలోనే కాళోజీ సోదరులు వెన్న హృదయం కలిగిన వారని తెలిపారు. బతుకు కమ్మదనాన్ని చెమ్మగిల్లిన కన్నులలో మాత్రమే చూడాలని చెప్పిన కవి కాళోజీ నారాయణరావు అని పేర్కొన్నారు. నా గొడవ పేరిట సమకాలీన సామాజిక సమస్యలపై నిర్మొహమాటంగా, నిక్కచ్చిగా, కటువుగా స్పందిస్తూ పాలకులపై అక్షరాయుధాలను సంధిస్తూ ప్రజాకవిగా కీర్తి గడించిన కాళోజీ స్ఫూర్తిని నేటితరం యువత అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు.

అనంతరం కాళోజీ నారాయణరావుపై ఉపన్యసించిన శేషభట్టర్ నరసింహాచార్యులు (జీవన్) మాట్లాడుతూ.. ప్రజాకవి కాళోజీ కేవలం తెలుగులో మాత్రమే కాదు ఉర్దూ, హిందీ, కన్నడం, ఇంగ్లీష్ తదితర భాషల్లో రచనలు చేసి ఖ్యాతి గడించారని తెలిపారు. ప్రజలను చైతన్యవంతం చేసిన కాళోజీ సోక్రటీస్‌లాంటి వాడని తెలిపారు. అనంతరం షాద్ కాళోజీ రామేశ్వర్‌రావు పురస్కార గ్రహీత అంజనీ కుమార్ గోయల్ మాట్లాడుతూ.. మానవులు పుడతారు, చనిపోతారు.. కానీ కొంతమంది మాత్రమే ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిస్వార్థంగా తమ జీవితాన్ని పణంగా పెట్టి మానవజాతిలో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. అలాంటి వారిలో కాళోజీ సోదరులు ఉంటారని అన్నారు. రామేశ్వర్‌రావు పురస్కారం అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం పొట్లపల్లి శ్రీనివాసరావు కార్యదర్శి నివేదిక సమర్పిస్తూ ఫౌండేషన్ ఆశయాలను, లక్ష్యాలను వివరించారు. అనంతరం మసూద్ మిర్జామహెషర్ రామేశ్వర్‌రావుపై ప్రసంగించారు. అనంతరం కాళోజీ ఫౌండేషన్ కోశాధికారి పందిళ్ల అశోక్ కుమార్ పురస్కారాల ప్రదానోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కాళోజీ ఫౌండేషన్ కార్యదర్శి వీఆర్.విద్యార్థి, డాక్టర్ ఆగపాటి రాజ్‌కుమార్, పి.చంద్, మర్రి మాధవరెడ్డి, డాక్టర్ కర్రె సదాశివ్, కవులు, రచయితలు తదితర 100 మంది సాహిత్యకారులు పాల్గొన్నారు.

### కాళోజీ విగ్రహానికి నివాళులు

ప్రజాకవి కాళోజీ నారాయణరావు వర్ధంతి సందర్భంగా నక్కలగుట్టలోని కాళోజీ విగ్రహానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, ఈవీ శ్రీనివాసరావు, పలువురు కవులు, రచయితలు పాల్గొన్నారు.

# చోరీ బంగారం కొనుగోలుపై కలకలం

**మరిపెడలో హైదరాబాద్ పోలీసులు తనిఖీ**

మరిపెడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): చోరీ బంగారాన్ని మరిపెడ బంగ్లాలోని రాంవిలాస్ గల్లీకి చెందిన ఓ గోల్డ్ షాపు నిర్వాహకుడు కొనుగోలు చేయగా గురువారం హైదరాబాద్ పోలీసులు ఆ షాపులో తనిఖీలు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన గౌడ సంఘం నేత ఇంట్లో నర్సింహులపేట మండలం గోపాతండాకు చెందిన ఇద్దరు బాలికలు పని మనిషిగా కుదిరారు. ఈ క్రమంలో ఆ నేత ఇంట్లో రూ.2.70లక్షల విలువైన నక్లెస్‌ను పని మనుషులు చోరీ చేసి గోపాతండాకు పరారై వచ్చారు. ఆ నక్లెస్‌ను మరిపెడ బంగ్లాలోని రాంవిలాస్ గల్లీకి చెందిన గోల్డ్ షాపు నిర్వాహకుడికి అమ్మగా రూ.30వేలు చెల్లించినట్లు తెలుస్తుంది. సదరు గౌడ్ సంఘం నేత హైదరాబాద్‌లోని పోలీసులకు ఫిర్యాదు చేయగా అక్కడి పోలీసులు స్థానిక గోల్డ్ షాపునకు చేరుకొని తనిఖీలు జరిపి వివరాలు సేకరించారు. ఆ యజమాని ఫిర్యాదుదారులను బతిమలాడి సదరు నక్లెస్‌కు అయ్యే రొక్కం ఇచ్చి చేతులు దులుపుకున్నట్లు తెలిసింది. చోరీ బంగారం మరిపెడ గోల్డ్ షాపు నిర్వాహకుడు కొనుగోలు చేయడంపై కలకలం రేపింది. మిగతా గోల్డ్ షాపు యజమానులు ఈ సంఘటనపై ఆందోళనకు గురయ్యారు.

# విడగొట్టారు.. చోద్యం చూస్తున్నారు..

(5వ పేజీ తరువాయి)

జిల్లాలుగా ఏర్పాటు చేసి ఐదేళ్లు కావొస్తోంది. అయితే ఇంకా అనేక శాఖల్లో పాత జిల్లాలపరంగానే పాలన సాగిస్తున్నాయి. ఇటీవల కేంద్ర ప్రభుత్వం జేఈఈ పరీక్షల కోసం నోటిఫికేషన్ ఇచ్చింది. ఆన్‌లైన్ సెంటర్లలో దరఖాస్తు చేసుకుంటున్న విద్యార్థు లకు జిల్లాల పేర్లు అయోమయానికి గురిచేస్తున్నాయి. విద్యార్థులు తమ జిల్లాను ఎంపిక చేసుకునే ఆప్షన్‌పై క్లిక్ చేస్తే హనుమకొండ, వరంగల్ జిల్లాల పేర్లు ఉండటం లేదు. వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్ జిల్లాల పేర్లు మాత్రమే కనిపిస్తున్నాయి. దీంతో ఏ జిల్లాను ఎంపిక చేసుకోవాలో తెలియక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు.

వరంగల్ రూరల్ జిల్లాలో ఉన్న ఆత్మకూరు, శాయంపేట, పరకాల తదితర మండలాలు ప్రస్తుతం హనుమకొండ జిల్లా పరిధిలో ఉండగా, నర్సంపేట నియోజకవర్గంతో పాటు వర్ధన్నపేట, పర్వతగిరి, రాయపర్తి తదితర మండలాలు ప్రస్తుతం వరంగల్ జిల్లా పరిధిలో ఉన్నాయి. ఈ ప్రాంత విద్యార్థులు ఏ జిల్లా ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలో అర్థంకాక తల పట్టుకుంటున్నారు. ఇక ఈ ప్రాంత విద్యార్థులు ఓబీసీ సర్టిఫికెట్లు కూడా అప్‌లోడ్ చేయాల్సి ఉంది. ఆ సర్టిఫికెట్‌లలో జిల్లా హనుమకొండ, వరంగల్ అని ఉంటుంది. వరంగల్ రూరల్ ఆప్షన్ ఎంపిక చేసుకున్న విద్యా ర్థులు హనుమకొండ జిల్లా పరకాల తహసీల్దార్ ఇచ్చిన ఓబీసీ సర్టిఫికెట్ చెల్లుతుందా లేదా అనే భయాందోళనలో విద్యార్థులు ఉన్నారు. వరంగల్, హనుమకొండ నగరాల్లో విద్యార్థులు వరంగల్ అర్బన్ జిల్లాను ఆప్షన్‌గా ఎంపిక చేసుకుంటున్నారు.

హనుమకొండ నగర విద్యార్థులు కూడా సర్టిఫికెట్ల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక పరీక్ష కేంద్రాల ఎంపికలో వరంగల్ జిల్లా మాత్రమే కనిపిస్తుంది. విద్యార్థి సొంత జిల్లా ఆప్షన్‌లో వరంగల్ ఉండటం లేదు. కానీ, పరీక్ష కేంద్రం ఆప్షన్‌లో మాత్రం వరంగల్ జిల్లా కనిపిస్తుంది. అయితే పరీక్ష కేంద్రాలన్నీ కూడా హనుమకొండలోనే ఉన్నాయి. దీంతో విద్యార్థులు జిల్లాల ఎంపికలో అయోమయానికి గురవుతున్నారు. జేఈఈ మెయిన్ పరీక్షలే కాకుండా అనేక ఎంట్రెన్స్ పరీక్షలకు సంబంధించి వరంగల్ అర్బన్, రూరల్ ఆప్షన్లు ఇస్తున్నారు. దీంతో విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారు.

2021లో జిల్లా సరిహద్దులు మారటంతో పాటు రాష్ట్రపతి గెజిట్ కూడా వచ్చినప్పటికీ ప్రభుత్వం విడుదల చేసే అధికారిక నోటిఫికేషన్లలో కొత్త జిల్లాల పేర్లు రాకపోవడానికి కారణం ఏమిటనే చర్చ జరుగుతోంది. ఇది కేవలం జేఈఈ పరీక్షలకు సంబంధించిన అంశమే కాదని, చాలా పరీక్షలు, ఉద్యోగ నోటిఫికేషన్లకు కూడా వరంగల్ రూరల్, అర్బన్ జిల్లాల పేర్లే ఆప్షన్‌గా ఇస్తున్నారని విద్యార్థులు అంటున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మద్యం షాపులకు టెండర్లు నిర్వహించింది. ఈ టెండర్లు కూడా వరంగల్ అర్బన్‌లో 67 మద్యం షాపులకు, వరంగల్‌రూరల్ 57షాపులకు నోటిఫికేషన్ ఇచ్చి పూర్తి చేశారు. ఎక్సైజ్ శాఖలో కూడా వరంగల్ అర్బన్, రూరల్ జిల్లాలనే పరిగణంలోకి తీసుకుంటున్నారు. కార్యాలయాలు కూడా ఈ విధంగానే కొనసాగుతున్నాయి. దీంతో వరంగల్, హనుమకొండ జిల్లాలు ఉన్నట్టా లేనట్టా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే కొన్ని నోటిఫికేషన్లతో పాటు కీలకమైన శాఖలకు అధికార యంత్రాంగం నియామకాలు వరంగల్, హనుమకొండ జిల్లాలుగానే జరుగుతున్నాయి. దీంతో నగరాన్ని గత ప్రభుత్వం రెండు ముక్కలు.. నాలుగు పేర్లుగా మార్చిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రధానంగా వరంగల్ నగరాన్ని రెండు ముక్కలుగా చేసి రెండు జిల్లాలను ఏర్పాటు చేయటంపై విమర్శలు ఉన్నాయి. హనుమకొండలో ఉన్న ఎన్ఐటీ వరంగల్, కాకతీయ విశ్వవిద్యాలయం, పోలీస్ కమీషనర్ వరంగ్, కేఎంసీ వరంగల్, తదితర విద్యాసంస్థలు, పలు ప్రభుత్వ కార్యాలయాలు వరంగల్ పేరుతోనే కొనసాగుతున్నాయి. హనుమకొండ జిల్లా పరిధిలోని కాకతీయ మెడికల్ కాలేజీ ఆవరణలో వరంగల్ ఎంజీఎంకు అనుబంధంగా కేంద్ర ప్రభుత్వం సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిని ఏర్పాటు చేసింది. హనుమకొండ జిల్లా పరిధిలోనే ఈ ఆస్పత్రి ఉన్నప్పటికీ వరంగల్ జిల్లా కలెక్టర్ పర్యవేక్షణ చేయాల్సి వస్తోంది. దీంతో పరిపాలన చిక్కులు ఎదురవుతున్నాయి. తన పరిధిలోకి పక్క జిల్లా కలెక్టర్ ఎలా వస్తారని హనుమకొండ జిల్లా కలెక్టర్ గతంలో ప్రశ్నించిన సందర్భాలు ఉన్నాయి. ఉమ్మడి వరంగల్‌లో జిల్లాల విభజనలో ఎదురవుతున్న అనేక చిక్కులను పరిష్కరించేందుకు ప్రభుత్వం దృష్టిసారించాలని మేధావులు, విద్యావంతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

### తప్పులు సరిదిద్దేది ఎప్పుడో ?

గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను ప్రస్తుతం ప్రభుత్వం సరిదిద్దే ప్రయత్నాలు చేయటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాల విభజ న గందరగోళంగా ఉందని స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ప్రధానంగా విద్యార్థులు పరీక్షల కోసం భయం భయంగా దరఖాస్తులు చేసుకోవాల్సి వస్తోంది. పరీక్షల కేంద్రాల వద్ద కూడా ఆధార్ కార్డుల్లో ఇంకా వరంగల్‌గానే చూపిస్తోంది. ఆధార్ అప్‌డేట్‌లో కూడా హనుమ కొండ, వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్ మూడు జిల్లాల పేరును చూపిస్తోంది. అయితే వరంగల్ జిల్లాను మాత్రం చూపించటం లేదు. అయితే లేని వరంగల్ అర్బన్, రూరల్ జిల్లాల పేర్లు చూపిస్తూ ప్రస్తుతం ఉన్న వరంగల్ పేరును సూచించకపోవడంతో జిల్లా ప్రజలు అయోమ యానికి గురవుతున్నారు. ఇలాంటి తప్పిదాలను ప్రస్తుత ప్రభుత్వం సరిదిద్దే ప్రయత్నాలు చేయటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

# ఆధ్యాత్మిక గుబాళింపు

» తెలంగాణకే తలమానికంగా నర్సంపేట ధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయం
» నేటి నుంచి 25వ మండల పూజ
» 41 రోజుల పాటు మాలధారులకు అన్నదానం



నర్సంపేటలోని అయ్యప్ప దేవాలయం

నర్సంపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఈ ఆలయం అపర శబరిమలగా విరాజిల్లుతోంది. దీక్షాకాలంలో వేలాది మంది మాల ధారులు దేవాలయంలో శరణుఘోష చేస్తారు. 25 ఏళ్లుగా వేలాది మందికి మాలధారణచేస్తూ నిత్యపూజలతో ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లుతోంది. వరంగల్ జిల్లా నర్సంపేటలో గల ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయం. తెలంగాణకే తలమానికంగా ఈ ఆలయం నిలుస్తోంది. అనతికాలంలోనే పవిత్ర దర్శనీయ క్షేత్రంగా ఎదిగింది. క్షేత్రబలి, పల్లివేట, పంబా ఆరాట్ (జలక్రీడ)ను కేరళలో ఏ విధంగా నిర్వహిస్తారో నర్సంపేటలోనూ అదే రీతిలో నిర్వహిస్తారు.

నర్సంపేట పట్టణంలోని మాధన్నపేట చెరువు కింది పెద్దవాగు సమీపంలో పచ్చని పొలాల చెంత 2000వ సంవత్సరంలో మూడెకరాల స్థలంలో ప్రముఖ వ్యాపారవేత్త దివంగత శింగిరికొండ రామాంజనేయులు, మరికొంత మంది వ్యాపారవేత్తల నేతృత్వంలో రాంరెడ్డి సిద్ధాంతి చేతుల మీదుగా ఈ ఆలయ ప్రతిష్ఠాపన జరిగింది. వివిధ వర్గాల నుంచి సేకరించిన రూ.70 లక్షల నుంచి కోటి వ్యయంతో ఆలయం నిర్మించారు. దాతల సహకారంతో మరో ఎకరం స్థలం కూడా కొనుగోలు చేశారు. దాతల సహకారంతో ఆలయం అనతి కాలంలోనే దినదిన ప్రవర్ధమానంతో అభివృద్ధి చెందిది. ఆలయంలో అయ్యప్ప స్వామితో పాటు గణపతి, పంచముఖేశ్వరస్వామి, సత్యనారాయణస్వామి, సుబ్రహ్మణ్యస్వామి, ఇంకా చిన్న ఆలయాలు ఉన్నాయి. ఈ ఆలయ ఆవరణలో అభయాంజనేయ స్వామి ఆలయమూ నిర్మించారు. పడిపూజల కోసం పెద్ద షెడ్డు నిర్మాణంతో పాటు సీసీ పనులు చేస్తున్నారు. ఆలయం ముందు భాగంలో షాపింగ్ కాంప్లెక్స్ కూడా నిర్మించారు. ఆలయ సేవా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్, ఆలయ కమిటీ చైర్మన్ సైసా సురేశ్ నేతృత్వంలో మండల పూజ మహోత్సవాల కోసం ట్రస్టు సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు కీలకపాత్ర పోషిస్తున్నారు.

ఈ ఆలయంలో ఏటా కార్తీకమాసం ఆరంభం నుంచి వేలాది మంది స్వామి దీక్షను స్వీకరిస్తారు. నిత్యం ఇక్కడ జరిగే పడిపూజ, పుష్పాభిషేకం తదితర ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు. ఆలయ ప్రధాన అర్చకుడు దినేశ్‌మిశ్రా ఆలయంలో నిత్యపూజలు నిర్వహిస్తారు. గురుస్వాముల ఆధ్వర్యంలో ఆలయంలో భక్తులు మండల కాలం (41రోజులు)పాటు స్వామి వారిని కొలుస్తూ అయ్యప్ప పాటలు, భజనలు చేస్తూ స్వామిని కొలుస్తుంటారు.



ఆలయంలో హోమం చేస్తున్న అయ్యప్ప దీక్షాపరులు

### 41 రోజులు అన్నదానం

దాతలు అందించే బియ్యం ఇతర సరుకులతో ఆలయంలో 41 రోజుల పాటు నిత్య అన్నదానం నిర్వహిస్తారు. దీక్షాపరులతో పాటు ఆలయానికి వచ్చే భక్తులకూ 41 రోజుల పాటు సహపంక్తి భోజనాలు పెట్టడం విశేషం.

### రైస్ మిల్లర్ల చేయూత

వరంగల్, హనుమకొండ, నర్సంపేట రైస్ మిల్లర్ల అసోసియేషన్ బాధ్యులు బియ్యం అందించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండల పూజ కోసం చాలా మంది భక్తులు అన్నదానం, పూజలు, ఆలయాభివృద్ధికి విరాళాలను అందిస్తుంటారు. అయ్యప్ప దీక్షా కాలం ముగిశాక మకర సంక్రాంతి రోజున చాలా మంది కేరళ రాష్ట్రంలోని శబరిమలలో మకర జ్యోతిని దర్శించుకొని మాల విరమిస్తారు. మరికొందరు స్థానిక దేవాలయంలో మకర జ్యోతిని తిలకించాక దీక్షను విరమిస్తారు.

### డిసెంబరు 8న పల్లివేట

పట్టణంలోని మునిసిపల్ కార్యాలయం ఆవరణలో పల్లివేటను దాతలు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణాప్రతాప్‌రెడ్డి-లక్ష్మీభార్గవి, గోగుల ప్రతాప్‌రెడ్డితో గురుస్వామి వెంకటేశ్‌శర్మ వేదమంత్రాల మధ్య పూజలు చేస్తారు. ఆలయం నుంచి మునిసిపల్ కార్యాలయం వరకు మాలధారులు నృత్యం చేసుకుంటూ పల్లివేట కార్యక్రమంలో పాల్గొంటారు. (జల క్రీడ)ను మాధన్నపేట చెరువులో డిసెంబరు 9న వైభవంగా నిర్వహించనున్నారు. అన్నదాత బీఆర్ఎస్ నేత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి- స్వప్న దంపతులు అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం పట్టణంలో ఊరేగింపు నిర్వహించాక మాధన్నపేట చెరువులో పంబాఆరాట్‌ను వైభవంగా నిర్వహించనున్నారు.

# విద్యార్థి నేతలపై దాడి అమానుషం

» కేయూ క్యాంపస్‌లో విద్యార్థి సంఘాల నాయకుల నిరసన
» స్మైల్ పాఠశాల ప్రిన్సిపాల్‌పై దాడికి పాల్పడిన వారికి రిమాండ్



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

కేయూ క్యాంపస్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి సంఘాలపై ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాల ఆరోపణలను ఖండిస్తూ, విద్యార్థి సంఘాల నాయకులపై దాడిని నిరసిస్తూ గురువారం కేయూలో విద్యార్థి సంఘాల నేతృత్వంలో నిరసన చేపట్టారు. కేయూ దూరవిద్య కేంద్రంలో నల్లబాడ్జీలు ధరించి ప్రైవేట్ యాజమాన్యాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పీడీఎస్‌యూ జాతీయ నాయకుడు మహేశ్, రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌వీ శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు, స్కాలర్స్ డి, తిరుపతి, కె.తిరుపతి, మధు, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.నాగరాజు, సూర్యకిరణ్, స్వేరోస్ జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయికుమార్, డీఎస్‌ఏ జిల్లా కన్వీనర్ శివ, డీఎస్ఏ శివ, పీఎస్ఏ ఫై వినయ్, బీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మనోహర్, చిరంజీవిలు మాట్లాడారు. స్మైలీ డీజీ స్కూల్‌కు బుధవారం మహాసభల ప్రచార నిమిత్తం వెళ్లిన పీడీఎస్‌యూ నేతలు గుర్రం అజయ్, మర్రి మహేశ్‌పై పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌వర్మ అసభ్యకరంగా మాట్లాడి ఎస్సీ, ఎస్టీల కులం పేరుతో దూషిస్తూ దాడికి దిగారని ఆరోపించారు. శ్రీనివాసవర్మపై వెంటనే అట్రాసిటీ కేసులు నమోదు చేసి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. స్మైలీ స్కూల్ ఒక అనుమతితో రెండు బ్రాంచీలను నిర్వహిస్తున్నారని ఆరోపించారు. అలాగే ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ అనుమతులు లేని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. విద్యార్థులపై పెట్టిన తప్పుడు కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొనగిరి మధు, కోశాధికారి రాణా ప్రతాప్, వంశీ, సురేశ్ పాల్గొన్నారు.

# కష్టాలు కడతేరేదెన్నడు..?!

- కొండాయి వంతెనకు కలగని మోక్షం
- నిధులు ఉన్నా కదలని పనులు
- ఊరు బయటకు వెళ్లాలంటే వాగు దాటాల్సిందే..

ములుగు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని కొండాయి బ్రిడ్జి నిర్మాణానికి మోక్షం కలగడంలేదు. శంకు స్థాపన చేసి రెండేళ్లు గడుస్తున్నా పనులు మాత్రం పునాది దశలోనే ఉన్నాయి. వంతెన పనులు పూర్తయితే రవాణా కష్టాలు తీరను న్నాయనుకున్న ప్రజలకు నిరాశే మిగిలింది. కొండాయి, మల్యాల, గోవిందరాజులకాలనీ, కన్నాయిగూడెం మండలం ఐలాపురం గ్రామాల ప్రజలకు ఎదురుచూపులు తప్పడం లేదు. ఊరుదాటాలంటే కాళ్లు తడవాల్సిన పరిస్థితి. ఏటా వర్షాకాలం వచ్చిందంటే చాలు.. జంపన్న వాగు ఎటు నుంచి వచ్చి తమ గ్రామాలను ముంచెత్తుతుందోనని ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడపాల్సిందే. జంపన్న వాగులో కొట్టుకుపోయి ప్రాణాలు పోతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తమవుతోంది.

గతంలో ఇక్కడ రూ. 7కోట్లతో నిర్మించిన వంతెన అప్పుడు కురిసిన భారీ వర్షాలకు కొట్టుకు పోయింది. ఈ క్రమంలో మంత్రి సీతక్క చొరవ తీసుకుని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ. 9.50 కోట్ల నిధులతో మరో వంతెన నిర్మించేందుకు నిర్ణయించారు. అనుకున్నదే తడవుగా ప్రభుత్వాన్ని ఒప్పించి టెండర్లను ఆహ్వానించి బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కానీ... వంతెన నిర్మాణ పనులు మాత్రం పూర్తి కాకపోవడంతో ఇప్పట్లో కొండాయి బ్రిడ్జికి మోక్షం కలిగేలా లేదు.

### నిధులున్నా కదలని పనులు

లోతట్టు ప్రాంత ప్రజల కష్టాలను తీర్చేందుకు అప్పటి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన ప్రస్తుత మంత్రి సీతక్క కొండాయి-దొడ్ల మధ్య జంపన్న వాగుపై రూ. 7 కోట్లతో వంతెన నిర్మించేలా చర్యలు చేపట్టారు. అయితే.. 2023 జూలై 27న కురిసిన భారీ వర్షాలకు జంపన్న వాగు ఉధృతి పెరిగి ఆ బ్రిడ్జి కొట్టుకుపోయింది. అదే సమయంలో కొండాయి, మల్యాల గ్రామాలు నీట మునిగిపోయాయి. ఆ వరదలో చిక్కుకుని అనేక మంది ప్రాణాలు కోల్పోయాలు. దీంతో చలించిపోయిన మంత్రి సీతక్క ఇలాంటి సంఘటనలు పునరావృతం కావద్దనే ఉద్దేశంతో అక్కడ



జంపన్న వాగు వరద ప్రవాహానికి కొట్టుకుపోయిన కొండాయి- దొడ్ల వంతెన (ఫైల్)

హైలెవల్ వంతెన నిర్మించాలని నిర్ణయించారు. ఈ క్రమంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి కొండాయి-దొడ్ల మధ్య జంపన్నవాగుపై రూ.9.50 కోట్లతో హైలెవల్ వంతెనను నిర్మించేందుకు 2024 మార్చి 16న శంకుస్థాపన చేపట్టారు. అయితే. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ మాత్రం పనులను తాత్సారం చేస్తున్నట్టు తెలుస్తోంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలకు రవాణా కష్టాలు తప్పడంలేదు.

### వాగు దాటి వెళ్లాల్సిందే..

కొండాయి, మల్యాల, గోవిందరాజుకాలనీ, ఐలాపూర్ గ్రామాలు ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్నాయి. అక్కడ నివస్తున్న ప్రజలు దైనందిన చర్యల్లో భాగంగా జంపన్నవాగును దాటాల్సి వెళ్లాల్సి ఉంటుంది. ఈ ఊళ్లలో కనీసం సెల్ ఫోన్ సిగ్నల్స్ సైతం సరిగా పనిచేయవు. నిత్యావసర సరుకులు కొనుగోలు చేయాలన్నా, వ్యవసాయానికి కావాల్సి సరుకులు కొనాలన్నా, రోగాల బారినపడి ఆస్పత్రిలో చూపించుకోవాలన్నా, మరే ఇతర పనికోసమైనా వాగు దాటాల్సిందే. ఆ గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి, జిల్లా కేంద్రానికి రావాలంటే జంపన్న వాగు మీదుగా ప్రయాణించాల్సి ఉంటుంది. బ్రిడ్జి నిర్మాణ పనుల్లో ఆలస్యం అవుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఈనెల 3న తమ కూతురుకు తీవ్ర జ్వరం రావడంతో కొండాయి గ్రామానికి చెందిన మాధురి, శేఖర్ దంపతులు అర్ధరాత్రి భుజాలపై ఎత్తుకుని ఉధృ తంగా ప్రవహిస్తున్న జంపన్న వాగు దాటడం చర్చనీయంశమైంది. ఇలాంటి సంఘటనలు ఈ ఏజెన్సీ గ్రామాల్లో కోకొల్లలు. ఆ గ్రామాల ప్రజల కష్టాలు తీరాలంటే కొండాయి-దొడ్ల మధ్య జంపన్న వాగుపై బ్రిడ్జి నిర్మాణం జరగా ల్సి ఉంది. సంవత్సరాలు గడుస్తున్నా వంతెన పనులు ముందుకు సాగడం లేదు. ప్రజల కష్టాలు కడతేరడం లేదు.

### గోవిందరాజుకూ ఇబ్బందే...

కొండాయి-దొడ్ల మధ్య చేపట్టనున్న వంతెన నిర్మాణం పనులు ఆలస్యం అవుతుండటంతో ఆయా గ్రామాల ప్రజలతోపాటు వారి కులదైవం గోవిందరాజుకూ ఇబ్బంది తప్పడంలేదని పలువురు అంటున్నారు. గోవిందరాజు స్వగ్రామం ఏటూరునాగారం మండలం కొండాయి. మహాజాతర సమయంలో ఆయన విగ్రహాలను గ్రామస్థులు జంపన్న వాగు మీదుగా మేడారానికి తీసుకెళ్తుంటారు. ఈ క్రమంలో వాగు దాడుతుండగా తీవ్ర ఇబ్బందుల ఎదురవుతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంతెన పనులు పూర్తయితే తమకు, తమతో పాటు వారు నమ్ముకున్న దైవం గోవిందరాజుకు కష్టాలు తప్పుతాయని చెబుతున్నారు. జాతర సమయంలో అధికారులు తాత్కాలిక రోడ్లు నిర్మించి చేతులు దులుపుకుంటున్నారని, అవి గట్టి వర్షం పడితే ఇట్టే కొట్టుకు పోతున్నాయని అంటున్నారు. వర్షాలు కురుస్తున్న సమయంలో అధికారులు పడవలు ఏర్పాటు చేసి వర్షాలు ఆగిపోవడంతో వాటిని నిలిపివేస్తున్నారని పలువురు చెబుతున్నారు. తాత్కాలిక ఏర్పాట్లతో తమ కష్టాలు తీరవని, కొండాయి నుంచి ఊరట్టం వైపు శాశ్వత రోడ్డు ఏర్పాటు చేస్తే సమస్యకు కాస్త పరిష్కార మార్గం దొరుకుతుందని గ్రామస్థులు అంటున్నారు.

### వర్షాల వల్లే వంతెన నిర్మాణ పనుల్లో ఆలస్యం

వరుసగా కురుస్తున్న వర్షాలతో కొండాయి-దొడ్ల బ్రిడ్జి నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతోంది. పునాదులు బలంగా ఉండేందుకు పైల్ ఫౌండేషన్ టెక్నాలజీతో నిర్మాణం చేపడుతున్నాం. ముందుగా అనుకున్న ప్లాన్‌ను మార్చాం. దీంతో నిధులు కాస్త ఎక్కువ అవుతాయని గ్రహించాం. రూ. 16 కోట్ల అంచనా వ్యయంతో ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వానికి నివేదిక పంపించాం. త్వరలో అప్రూవల్ వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం కాంట్రాక్టర్ గడర్స్ పనులు చేపడు తున్నారు. వర్షాలు తగ్గి జంపన్న వాగు నీటి ప్రవాహం తగ్గుముఖం పడితే పునాది పనులు మొదలవుతాయి. వంతెన నిర్మాణం త్వరలోనే పూర్తయ్యేలా కృషి చేస్తున్నాం.

- రామకృష్ణ, ఆర్అండ్‌బీ డీఈఈ (ములుగు)

## మంత్రిని కలిసిన మధ్యాహ్న భోజన కార్మికులు



మంత్రి సీతక్కతో మధ్యాహ్న భోజన కార్మికులు

ములుగు రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికులు మంత్రి సీతక్కను జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో గురువారం కలిశారు. తమ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం మధ్యాహ్నభోజనం వంట కార్మికులకు రూ. 10 వేలు చెల్లిం చాలని, మెనూ చార్జీలు పెంచాలని అన్నారు. రెండు కూరలు వండాలని, మూడు గుడ్లు తప్పనిసరిగా ఇవ్వాలని అధికారులు చేసే ఒత్తిడిని తగ్గించాలని కోరారు. దీనిపై మంత్రి సీతక్కను సానుకూలంగా స్పందించారని, సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారని రవీందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అమ్జద్ పాషా, మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సామల రమ, ప్రధాన కార్యదర్శి గున్నాల రాజ కుమారి, వంట కార్మికులు కోరెడ్డి ప్రమీల, గడ్డం భారతి, మాలగాని కమల, పౌర రాధ, అంకం పద్మ, ముద్దబోయిన భారతి, సామ సమ్మక్క, గుండ్రెడ్డి శ్రీనివాస్, భవాని, శోభ, అమృత, సుగుణ, స్వరూప, భాగ్య, ఆసలి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

కన్నాయిగూడెం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు మండలంలో గురువారం పర్యటించారు. ముప్పనపల్లి, సర్వాయి గ్రామాల్లోని కోరం సంపత్, వనపర్తి రామయ్య, మంచాల నర్సింహరావు పొలాల్లోని డబ్ల్యూజీఎల్ 962 రకం వరి విత్తన క్షేత్రాలను పరిశీలించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి ముంజ మహేష్‌తో కలిసి శాస్త్రవేత్తలు ఎం.గోపీనాథ్, పి.గోనియా నాయక్, జి.శేషు పర్యటించారు. నాణ్యమైన విత్తనాలను రైతులే ఉత్పత్తి చేసుకోవాలని అన్నారు. డబ్ల్యూజీఎల్ 962 రకం అధిక వర్షపాతాన్ని, చీడ పీడలను, తెగుళ్లను తట్టుకొని మంచి దిగుబడి ఇస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో కల్యాణి, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

## కల్లు గీత కార్మిక సంఘం జిల్లా కమిటీలో ఇద్దరికి చోటు



మల్లేష్, సారయ్య

గోవిందరావుపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కల్లుగీత కార్మికసంఘం ములుగు జిల్లా కమిటీలో మండలంలోని ఇద్దరికి అవకాశం దక్కింది. జిల్లా సహాయ కార్యదర్శిగా గోవింద రావు పేటకు చెందిన రుద్రబోయిన మల్లేష్ గౌడ్, సభ్యుడిగా చల్వాయి గ్రామానికి చెందిన వత్సవాయి సారయ్యగౌడ్ ఎంపికయ్యారు. ఈసందర్భంగా వారు గురువారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. కల్లుగీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషిచేస్తావని పేర్కొన్నారు. తమ ఎంపికకు సహక రించిన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు పులి నర్సయ్యగౌడ్, జిల్లా అధ్యక్షుడు గుండెబోయిన రవిగౌడ్, జిల్లా కార్యదర్శి బుర్ర శ్రీనివాస్‌గౌడ్, జిల్లాలోని గీతకార్మికులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపు తున్నట్లు పేర్కొన్నారు.

## విద్యార్థుల హక్కులను కాపాడాలి

### ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యురాలు సుమ

ఏటూరునాగారం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల హక్కులను పరిరక్షించాలని, ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పకడ్బందీ చట్టాలను అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యురాలు దాసగాని సుమ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సెమినార్ హాల్లో జిల్లా అధ్యక్షుడు రవితేజ అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళా చట్టాలను అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాని విమర్శించారు. దీంతో మహిళలు, విద్యార్థినులపై అరాచకాలు పెట్రేగి పోతున్నాయన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన స్కూటీల పథకాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ములుగు జిల్లా కార్యదర్శి టీఎల్. రవి, జిల్లా ఉపాధ్యక్షులు బాలు, నాయకులు మమత, రామలక్ష్మి, మనవిత, దామిని, జ్యోత్స్న, కావ్య, షబానా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 10 మందితో కూడిన నూతన కన్వీనింగ్ కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా మధులత, కోకన్వీనర్‌గా మనస, స్రవంతి ఎన్నికయ్యారు.

## మిల్లర్లు బ్యాంకు హామీ పత్రాలు సమర్పించాలి

### అదనపు కలెక్టర్ అశోక్ కుమార్

భూపాలపల్లిటౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వానాకాలం ధాన్యం కొనుగోలు కార్యక్రమం సజావుగా సాగేందుకు రైస్ మిల్లర్లు బ్యాంకు హామీ పత్రాలు సమర్పిం చాలని అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ సూచించారు. ఐడీవోసీ కార్యాలయంలో రైస్ మిల్లర్లతో గురువారం ఆయన సమావేశమయ్యారు. ఎలాంటి ఆటంకం రాకుండా మిల్ పాయింట్ల వద్ద తగిన ధాన్యాన్ని మిల్లర్లు సమయానికి అన్‌లోడింగ్ చేసి కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. సమావేశంలో సివిల్ సప్లయ్ అధికారి కిరణ్‌కుమార్, డీఎం రాములు తదితరులు పాల్గొన్నారు.

## మునిసిపల్ కార్యాలయాన్ని సందర్శించిన ట్రెయినీ ఐఏఎస్‌లు

భూపాలపల్లిటౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి మునిసిపల్ కార్యాలయాన్ని 12 మంది ట్రెయినీ ఐఏఎస్ అధికారులు గురువారం సందర్శించారు. పట్టణ అభివృద్ధి గురించి ఈ సందర్భంగా మునిసిపల్ అధికారులు వారికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్, మునిసిపల్ ప్రత్యేక అధికారి విజయలక్ష్మి, టీపీవో సునీల్‌కుమార్, ఏఈ రజనీకర్, టెక్నికల్ అధికారి మానస, ఇన్‌చార్జి మేనేజర్ సుభాష్, సిబ్బంది అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

భూపాలపల్లిటౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 20 వరకు కొనసాగనున్నాయి. ఈ మేరకు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి టి.శ్రీలత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వారోత్సవాలను పురస్కరించుకుని కళాశాలలు, పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం, రంగోళి, పాటల పోటీలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయడానికి అన్ని విద్యా సంస్థల యాజమాన్యాలు సహకరించాలని కోరారు.

## అందెశ్రీకి ఘన నివాళులు

చిట్యాల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చల్లగరిగలో ప్రజాకవి కవి అందెశ్రీకి గురువారం ఘన నివాళులు అర్పించారు. అందెశ్రీ చిత్రపటానికి ప్రభుత్వ పాఠశాల ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం బండి శ్రీను, సామాజిక కార్యకర్త నోముల శివశంకర్ పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ మాజీ చైర్మన్ మ్యాదరి వీరస్వామి, యూత్ నాయకులు కొల్లూరి అశోక్, రామస్వామి, రఘుపతి, వెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కరస్పాండెంట్‌పై దాడి అమానుషం : ట్రస్మా

చిట్యాల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : హన్మకొండలోని ఓ పాఠశాల కరస్పాండెంట్‌పై పీడీఎస్‌యూ నాయకుల దాడి అమానుషమని ట్రస్మా జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎం.డి.రాజ్‌మహ్మద్ విమర్శించారు. చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి మండలాలకు చెందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల ఆధ్వ ర్యంలో మండల కేంద్రంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజ్‌మహ్మద్ మాట్లాడుతూ పీడీఎస్‌యూ బాధ్యులు చందా వసూళ్లకు వెళ్లి కరస్పాండెంట్‌పై భౌతిక దాడికి పాల్పడడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా ఉపాధ్యక్షుడు ఆకుల రమేష్, ఈసీ మెంబర్లు మియాపురం హరీశ్, గొల్ల సతీష్‌కుమార్, బండి సంపత్, శ్రీధర్, శ్రీనివాస్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రేపు జాతీయ ఎస్టీ, ఎస్సీ కమిషన్ చైర్మన్ రాక

మహాముత్తారం, నవంబరు13(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా గోదవరిఖని ఎంటీపీసీకి జాతీయ ఎస్టీ, ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వాన ఈనెల 15,16 తేదీల్లో పర్యటించనున్నారని ప్రజా సంఘాల నేతలు తెలిపారు. ఈమేరకు వారు మండల కేంద్రంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఎస్టీ, ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఎవరికైనా సమస్యలుంటే నేరుగా కమిషన్ చైర్మన్‌ను కలవచ్చని తెలిపారు. విలేకరుల సమావేశంలో అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ జిల్లా అధ్యక్షుడు కిరణ్, ఆలిండియా అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు రామగిరి రాజు, గౌరవ అధ్యక్షుడు సడివలిరావ తదితరులు పాల్గొన్నారు.

## గుంతల'కీ' బలైపోయారు..

(5వ పేజీ తరువాయి)

బయలు దేరారు. ఈ క్రమంలో ఆత్మకూరు మండలం కొత్తగట్టు క్రాస్ రోడ్డు వద్దకు రాగానే రోడ్డుపై ఉన్న గుంతలను తప్పించబోయి అదుపు తప్పి పల్టీలు కొట్టుకుంటూ రోడ్డు పక్కన ఉన్న చెట్టును అతివేగంగా ఢీకొట్టింది. దీంతో కారు వెనుక సీట్‌లో కూర్చున్న పార్శ సంపత్, బొంపల్లి కిషన్‌రావు అక్కడిక్కడే మృతి చెందారు. డ్రైవింగ్ చేస్తున్న పోతరాజు వెంకటేష్, పక్కన కూర్చున్న చింతపట్ల మురళీకృష్ణలు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. పార్శ సంపత్ భార్య సరస్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను వరంగల్ ఎంజీఎంకు తరలించారు. మృతిచెందిన పార్శ సంపత్‌కు భార్య సరస్వతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బొంపల్లి కిషన్‌రావుకు భార్య అర్పిత, ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరి మృతితో బాధిత కుటుంబాలు కన్నీరు మున్నీరవుతున్నాయి.

### • జరంత ఉపశమనం



శీతాకాలం ప్రభావం రోజురోజుకూ పెరుగుతోంది. చలి తీవ్రతరం కావడంతో ప్రజలు గజగజ వణుకుతున్నారు. ఉష్ణోగ్రతలు తగ్గడంతో పొంగమంచు కమ్ముకుంటోంది. భూపాలపల్లిలో ఉష్ణోగ్రత గురువారం 19 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయింది. దీంతో చలిలో ప్రజలు సాయంకాలం బయటకు వెళ్లడానికి జంకుతున్నారు. తప్పనిసరి పరిస్థితిలో స్వెట్టర్లు ధరించి, దుప్పట్లు కప్పుకొని వెళ్తున్నారు. చలిమంటలు పెట్టుకుంటేనే చలి నుంచి కాస్తంత ఉపశమనం పొందే పరిస్థితి. ఇలాంటి దృశ్యమే భూపాలపల్లిలో గురువారం కనిపించింది.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, భూపాలపల్లి (ఆంధ్రజ్యోతి)

## మేడారం జాతరకు 3,800 బస్సులు

హనుమకొండ టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క- సారలమ్మ మహాజాతరకు భక్తుల కోసం రాష్ట్రవ్యాప్తంగా 3,800 ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్‌లోని సచివాలయ సమావేశ మందిరంలో అధికారులతో యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసినట్లు ఆర్టీసీ అధికారులు గురువారం తెలిపారు. 2026 జనవరి 28 నుంచి 31 వరకు మేడారం జాతర జరుగుతుందన్నారు. ఇప్పటికే జాతర కోసం రోడ్ల అభివృద్ధి, భక్తులకు కావాల్సిన వసతుల కోసం నిధులు కేటాయించి పనులు జరుగుతున్నాయని తెలిపారు. కాగా, వరంగల్ రీజియన్ నుంచి 1680 బస్సులు నడుపనున్నట్లు వరంగల్ ఆర్టీసీ ఆర్ఎం భాను తెలిపారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లిటౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. భూపాలపల్లి పట్టణంలోని మంజూర్‌నగర్‌లో ఉన్న ఎంఎస్ఆర్ కాటన్ ఇండస్ట్రీస్‌లో సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తికొనుగోలు కేంద్రాల్లోనే రైతులు విక్రయించాలని కోరారు. 12శాతం తేమ ఉండటం వల్ల రైతులు నష్టపోతున్నారని అన్నారు. 20శాతం తేమ ఉండేలా కొనుగోలు చేయాలన్నారు. పత్తి ఎకరానికి 7క్వింటాళ్ల కొనుగోలు చేయాలనే నిబంధన కేంద్ర ప్రభుత్వం ఎత్తివేసి 12క్వింటాళ్లు కొనుగోలు చేసేలా సహకరించాలని అన్నారు. ఈ సందర్భంగా మద్దతు ధర పోర్టల్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

### సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

రేగొండ, (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని రైతు వేదికలో రేగొండ, కొత్తపల్లిగోరి మండలాలలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పంపిణీ చేశారు. 37 మందికి రూ.11లక్షల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ గూటోజు కిష్టయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సయ్య, నాయకులు ఎడ్ల మల్లారెడ్డి, ఏనుగు రవిందర్‌రెడ్డి, మోడెం ఉమేష్ గౌడ్, మటిక సంతోష్, వీరబ్రహ్మం, పున్నం రవి, కొలెపాక సాంబయ్య, పట్టెం శంకర్, మేకల భిక్షపతి, మొట్టె



భూపాలపల్లి పత్తి కొనుగోలును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గండ్ర

కిరణ్‌పటేల్, వీరూ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### చిట్యాలలో..

చిట్యాల, (ఆంధ్రజ్యోతి) : స్థానిక రైతు వేదికలో చిట్యాల, టేకుమట్ల మండలాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పంపిణీ చేశారు. ఎన్నికల హామీలన్నింటిని ఒక్కొక్కటిగా నెరవేస్తున్నామన్నారు. మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సు ప్రయాణం, వడ్డీ లేని రుణాలు, రూ. 500కే గ్రాస్ సిలిండర్, ఉచితంగా విద్యుత్, రైతులకు రుణమాఫీ, వరికి బోనస్, రైతుబంధు అమలు తదితర సంక్షేమ పథకాలు సమర్థంగా అమలవుతున్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులకు ప్రజలు అండగా నిలవాలని కోరారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ ఇమామ్ బాబా షేక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి మధువంశీకృష్ణ, జిల్లా నాయకులు పులి తిరుపతిరెడ్డి, దొడ్డి కిష్టయ్య, చిలుకల రాయకొమురు, టౌన్ అధ్యక్షుడు బుర్ర లక్ష్మణ్, గడ్డం కొమురయ్య, గుర్రపు తిరుపతి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అల్లకొండ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## భూభారతి సమస్యలు పరిష్కరించాలి : కలెక్టర్ రాహుల్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లిటౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): భూభారతి, రెవెన్యూ సదస్సులు, సాదాబైనామాల సమస్యల పరిష్కరించాలని, లేదంటే చర్యలు తప్పవని తహసీల్దార్లతో కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. ఐడీవోసీ కార్యాలయంలో భూభారతి, రెవెన్యూ సదస్సులు, సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం కోసం అన్ని మండలాల తహసీల్దార్లతో ఆయన గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను శనివారం వరకు పరిష్కరించి పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. రెవెన్యూ సదస్సులు నిర్వహించి ఆరు నెలలు గడిచినా దరఖాస్తుల పరిష్కారంలో ఆశించిన స్థాయిలో ప్రగతి కనబడటం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, కాటారం సబ్‌కలెక్టర్ మయాంక్‌సింగ్, ఆర్డీవో రవి పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనపై ప్రజలకు చెదరని నమ్మకం

(5వ పేజీ తరువాయి)

అందిస్తున్నామని తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సందర్భంగా ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలు ఎన్ని కుట్రలు పన్నినా, సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేసినా ప్రజలు కాంగ్రెస్ వైపే మొగ్గు చూపారని అన్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి ఏమిటో చూపించుకోలేని బీఆర్ఎస్ నేతలు సానుభూతి అంశంతో గెలవాలని చూసిందని వ్యాఖ్యానించారు. మంత్రి వెంట ఏఎంసీ చైర్‌పర్సన్ పంతకాని తిరుమల, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్, మహదేవపూర్ పీఏసీఎస్ చైర్మన్ చల్ల తిరుపతి రెడ్డి, కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు గద్దె సమ్మిరెడ్డి, జాడి మహేశ్వరి, తెప్పల దేవేందర్‌రెడ్డి, కడారి విక్రమ్, తిరుపతిరావు,నరేష్, రమేష్, అశోక్, రాజు, రఘునందన్, తిరుపతిరెడ్డి, వెంకట్ రెడ్డి, సంపత్, కిరణ్, శ్రీధర్, ప్రభాకర్, శ్రావణ్, మహేష్ తదితరులు ఉన్నారు.

## రైతులను వంచిస్తే కఠిన చర్యలు

(5వ పేజీ తరువాయి)

ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవన్నారు. ధాన్యం రవాణాలో ఇబ్బందులకు గురిచేస్తే లైసెన్సులు రద్దు చేస్తామన్నారు. పోలీసులు, రవాణా అధికారులు లారీలను ముమ్మరంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. ట్రాన్స్‌పోర్టర్లు రైతులకు డబ్బులు ఇవ్వక ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రైస్ మిల్లర్లు, ట్రాన్స్‌పోర్టర్లు వ్యాపార దృష్టితో కాకుండా రైతుల పక్షాన ఉండాలని సూచించారు. కలెక్టర్ రాహుల్‌శర్మ మట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు ఉండాలని తెలిపారు. అకాల వర్షాలు వస్తే ధాన్యం తడవకుండా టార్పాలీన్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఎత్తు ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తే వర్షాలు రావడంతో ఇబ్బందులు తలెత్తుతాయని అన్నారు. వరికోతలపై మండల స్థాయిలో రైతులకు అధికారులు అవగాహన కల్పించాలని అన్నారు. తాలు రాకుండా సరైన యంత్రాలను ఎంచుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, గ్రంథాలయ చైర్మన్ రాజబాబు, పౌరసరఫరాల శాఖ అధికారి కిరణ్ కుమార్, డీఎం రాములు, ఆర్డీవో సంధాని, సహకార అధికారి వాలియానాయక్, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, డీఆర్డీవో బాలకృష్ణ, మార్కెటింగ్ అధికారి ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.